RNI No: APTEL /25/A2860

# సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 14 | పేజీలు : 4 | శనివారం 18 జూలై 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



## మహారాష్ట్రలో బీజేపీ మాస్టర్ ప్లాన్!

- ముందు ఎన్సీపీ విలీనం..
- తర్వాత ఎన్డీయేలోకి..
- ఎన్సీపీ విలీనంపై జోరుగా చర్చలు
- ముందు విలీనం.. తర్వాత ఎన్డీయే ఫార్ములా
- 15 రోజుల్లో తుది ప్రకటనకు అవకాశం
- విలీనం లేకపోతే ప్రత్యేకంగానే ఎన్డీయేలో చేరే ఛాన్స్

## హైదరాబాదులో పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన నారా లోకేశ్

గతంలో పవన్ భుజానికి గాయం

ఇటీవల ముంబైలో విజయవంతంగా శస్త్రచికిత్స

కొన్ని రోజుల కిందటే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి

హైదరాబాదులోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న వైనం

పవనన్న త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన లోకేశ్



ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం పరామర్శించారు. ఇటీవల ముంబయిలో భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కల్యాణ్‌ను లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా "పవనన్న త్వరగా కోలుకోవాలి" అని ఆయన ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. భుజానికి అయిన గాయం, జరిగిన శస్త్రచికిత్స వివరాలను అడిగారు. వైద్యుల సూచనల మేరకు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. తన పరామర్శ అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. "డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారిని పరామర్శించాను. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించాను. వైద్యుల సూచనలు పాటిస్తూ వీలైనంత మేర విశ్రాంతి తీసుకోవాలని సూచించాను" అని తెలిపారు. గతంలో భుజానికి గాయం కావడంతో పవన్ కల్యాణ్ కొంతకాలంగా ఇబ్బంది పడుతున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో ఆయన కుడి భుజానికి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత ఆయన హైదరాబాద్‌లోనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. పలువురు ప్రముఖులు ఆయన నివాసానికి వచ్చి పరామర్శిస్తున్నారు.

## భారత అంతరిక్ష చరిత్రలో నవశకం



తొలి ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్-1' ప్రయోగం సక్సెస్

స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం

భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటాల్ రాకెట్‌గా రికార్డు సృష్టి

శ్రీహరికోట నుంచి నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్

'ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం చారిత్రాత్మకం

ప్రధాని సందేశంతో పాటు పలు పేలోడ్లను కక్ష్యలోకి మోసుకెళ్లిన 'విక్రమ్-1'

# ఈ నెల నుంచే 'తల్లికి వందనం'



2027 నాటికి పోలవరం పూర్తి: గుడివాడ సభలో చంద్రబాబు కీలక ప్రకటన

నేడు గుడివాడలో పర్యటించిన సీఎం చంద్రబాబు

పట్టిసీమను 12 నెలల రికార్డు కాలంలో పూర్తి చేశామన్న సీఎం

తల్లికి వందనం పిల్లలందరికీ వర్తింప చేస్తామని స్పష్టీకరణ

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి వంద శాతం పూర్తి చేసి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా గుడివాడలో పర్యటించిన ఆయన, అక్కడ జరిగిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' బహిరంగ సభలో మాట్లాడుతూ పోలవరం నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం అత్యంత శరవేగంగా ముందుకు తీసుకెళుతోందని ప్రకటించారు. గతంలో తాము కేవలం 12 నెలల రికార్డు కాలంలోనే పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేసి కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలోని నదులన్నింటినీ అనుసంధానం చేయడం ద్వారా ఏపీలో కరవు అనే మాటే లేకుండా చేస్తామని భరోసా ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుపై స్పందిస్తూ.. ఈ నెల నుంచే రాష్ట్రంలో 'తల్లికి వందనం' పథకాన్ని ప్రారంభించబోతున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. కృష్ణా జిల్లాకు ఎంతో ఘనమైన చారిత్రాత్మక నేపథ్యం ఉందని కొనియాడిన ముఖ్యమంత్రి, అభివృద్ధిలోనూ ఈ ప్రాంతాన్ని ముందంజలో ఉంచుతామన్నారు. కేవలం ప్రాజెక్టులే కాకుండా నగరాలు, గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు 'చెత్త నుంచి సంపద సృష్టి' చేయడమే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.



## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుమల క్షేత్రంలో భక్తుల రద్దీ భారీగా కొనసాగుతోంది. వారాంతం కావడంతో శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ పూర్తిగా నిండిపోయి, క్యూలైన్లు బయట శిలాతోరణం వరకు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనం కోసం సుమారు 24 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. ఈ రద్దీ కారణంగా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్న భక్తులకు కూడా దర్శనానికి 3 నుంచి 6 గంటల సమయం పడుతోంది. టీటీడీ వెల్లడించిన వివరాల ప్రకారం, శుక్రవారం (జులై 17) ఒక్కరోజే 74,096 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 36,562 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.66 కోట్లుగా నమోదైంది. భక్తుల కోసం 4 లక్షల లడ్డూలను విక్రయించగా, 2.98 లక్షల మందికి అన్నప్రసాదం అందించారు. సుమారు 3,890 మందికి వైద్య సేవలు అవసరమయ్యాయి. భారీ రద్దీ దృష్ట్యా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తులకు పాలు, తాగునీరు, అన్నప్రసాదాలను నిరంతరాయంగా పంపిణీ చేస్తోంది.



## ఏపీలో విషాదం

గోదావరిలో చేపలు పట్టేందుకు వెళ్లి ఐదుగురు గిరిజనుల మృతి

పోలవరం ఎటపాక మండలం గొమ్ముకొత్తగూడెంలో విషాదం

గోదావరి ప్రవాహ వేగానికి కొట్టుకుపోయిన గిరిజనులు

గల్లంతైన వారికోసం విస్తృత గాలింపు

ఆంధ్రప్రదేశ్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. పోలవరం జిల్లా ఎటపాక మండల పరిధిలోని గొల్లగూడెం సమీపంలో గోదావరి నదిలో ఐదుగురు గిరిజనులు గల్లంతయ్యారు. వారిలో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక మత్స్యకారులు, ఈతగాళ్ల సహాయంతో గోదావరి నదిలో గల్లంతైన వారి కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. తీవ్ర గాలింపు అనంతరం వారి మృతదేహాలను వెలికి తీశారు. ఈ ప్రమాదం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే... నిత్యం వెళ్లేలాగే వీరంతా కలిసి గోదావరి నదిలో చేపలు పట్టేందుకు వెళ్లారు. అయితే నదిలో ఒక చోట అంచనా తప్పి, ఊహించని విధంగా నీటి లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలోకి దిగడంతో ప్రవాహ వేగానికి కొట్టుకుపోయారు. మృతి చెందిన వారందరినీ గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఒకే గ్రామానికి చెందిన వారు మృతి చెందడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

# అవినీతిపరుల గుండెల్లో దడ

అక్రమ సొమ్మంతా బినామీ పేర్ల మీదే!

వారి లెక్కలూ తేల్చనున్న ఆదాయ పన్ను శాఖ!

అక్రమార్కులపై బినామీ ఆస్తుల నిరోధక చట్టం

ప్రయోగించడానికి సిద్ధమవుతోన్న ఆదాయపు పన్ను శాఖ

అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం

అవినీతి అధికారుల రూ.వందల కోట్ల విలువైన అక్రమాస్తుల చిట్టాలు ఇటీవల ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. ఏ అధికారి వద్ద చూసినా కళ్లు చెదిరేలా నగలు, నగదు, లెక్కలేనన్ని ఫ్లాట్లు, ఎకరాల కొద్దీ వ్యవసాయ భూములు, పక్క రాష్ట్రాల్లో ఆస్తులు వెలుగు చూస్తున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకొని కొందరు అక్రమార్కులు పోగేస్తున్న సంపద లెక్కకు మిక్కిలిగా ఉంటోంది. ఇలాంటి వారి అంతు చూడటానికి ఆదాయపు పన్ను శాఖ రంగంలోకి దిగింది. ప్రస్తుతం అవినీతిపరుల గుండెల్లో దడ పుట్టిస్తున్న అవినీతి నిరోధక శాఖతో కలిసి అస్త్రాలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా అక్రమ సొమ్మును బినామీల పేర్ల మీద పెడుతున్న అవినీతి అధికారుల అక్రమార్జనను గుర్తించి, జప్తు చేసేందుకు బినామీ లావాదేవీల నిరోధక విభాగం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. బినామీ ఆస్తుల లావాదేవీల నిరోధక చట్టం-1988తో బినామీల గుట్టు రట్టు చేయనుంది. దీనికి సంబంధించి అవినీతి నిరోధక శాఖ అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆస్తులన్నీ బినామీల పేర్ల మీదే : ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏ అధికారి ఇంట్లో సోదాలు చేసినా, మార్కెట్? ధరల ప్రకారం రూ.వందల కోట్ల ఆస్తులు వెలుగు చూస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల దొరికిన డీఎస్పీ భీంరెడ్డి ఆస్తుల విలువ మార్కెట్? ధరల ప్రకారం కనీసం రూ.200 కోట్లు ఉంటుందని అంచనా. కర్ణాటకలో ఒక దగ్గర 38, మరో దగ్గర 6 ఎకరాల భూమి కొనుగోలు చేసిన హోంగార్డు అతని బినామీ అని గుర్తించారు. ఇలాంటి బినామీలు 10 మంది వరకు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈయనొక్కడే కాదు, పట్టుబడుతున్న వారిలో అత్యధికులు తమ ఆస్తులను బినామీల పేర్ల మీద బదలాయిస్తున్నారు. వారు విధుల్లో ఉన్నప్పుడు తమ పేర్ల మీద ఆస్తులు కొనుగోలు చేయాలంటే అధికారిక అనుమతులు తీసుకోవాలి. అలా చేస్తే వారి బండారం బయటపడుతుండటంతో బినామీలను పెట్టుకుంటున్నారు. అవినీతి నిరోధక చట్టం ప్రకారం కేసు దర్యాప్తు చేసే అధికారులు బినామీల జోలికి వెళ్లరు. వారి వాంగ్మూలం నమోదు చేసి, న్యాయస్థానానికి తెలియజేస్తారు. దీంతో అక్రమార్కులకు తేలికగా తప్పించుకునే అవకాశం ఉంది. ఏడాదికి 60-70 కేసులు : బినామీ ఆస్తుల లావాదేవీల నిరోధక చట్టం ఇలాంటి బినామీలను గుర్తించి, వారి పేర్ల మీద ఉన్న ఆస్తులను కూడా జప్తు చేసే అధికారం ఆదాయపు పన్ను శాఖకు కట్టబెట్టింది. దీనికోసం ప్రత్యేకంగా బినామీ లావాదేవీల నిరోధక విభాగం ఏర్పాటు చేశారు. హైదరాబాద్? విభాగంలో ఏడాదికి 60 నుంచి 70 కేసులు నమోదవుతున్నాయి. కేసు వివరాలు తెప్పించుకుంటున్న అవినీతి నిరోధకశాఖ : ఉదాహరణకు కరడుగట్టిన నేరగాడు నయీం బెదిరించి రాయించుకున్న ఆస్తులను తన కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల పేర్ల మీద పెట్టాడు. నయీం నేరాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టినప్పుడు బినామీల గుట్టు రట్టు చేసే పని ఆదాయ పన్ను శాఖ తీసుకుంది.

శనివారం 18 జూలై 2026

సీమ వార్త
సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా



.....తురుకులాపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి సవిత

.....కోడి గుడ్ల నాణ్యతపై మంత్రి సవిత ఆగ్రహం

.....గుడ్ల పరిమాణం ప్రమాణాలకు తగ్గట్లేదంటూ అధికారులపై మంత్రి ఆగ్రహం

.....వెయింగ్ మిషన్ లేకపోవడంపై అధికారులకు మంత్రి సవిత హెచ్చరిక

# “గోలీ”లాంటి గుడ్లపై కన్నెర్ర..!!



**రొద్దం జూలై 18 సీమ వార్త సాయంత్రం.**





పెనుకొండ నియోజకవర్గంలోని రొద్దం మండలం తురుకులాపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత ఒ జౌళి శాఖల మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, విద్యార్థినుల వసతి గృహాన్ని పరిశీలించిన మంత్రి, విద్యార్థినులకు అందుతున్న విద్యా ప్రమాణాలు, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అందిస్తున్న భోజనం నాణ్యత, వసతి సౌకర్యాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన గుడ్లను పరిశీలించిన మంత్రి, వాటి పరిమాణం ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. అలాగే పాఠశాలలో వెయింగ్ మిషన్ లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులను మందలించారు. ఈ అంశాలపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అనంతరం విద్యార్థినులతో నేరుగా మాట్లాడిన మంత్రి సవిత, వారి విద్యాభ్యాసం, భోజనం, వసతి, పరిశుభ్రత తదితర అంశాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సౌకర్యాలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం, మెరుగైన వసతి సౌకర్యాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎక్కడైనా లోపాలు కనిపిస్తే వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## రాప్తాడు వ్యవసాయ మార్కెట్ కు భూమి కేటాయింపు

ఎమ్మెల్యే పరిటాల సునీతకు కృతజ్ఞతలు తెలిపిన కమిటీ సభ్యులు

పండమేరు ఆలయానికి సంబంధించిన 15ఎకరాలు లీజుకు అనుమతి

రాప్తాడు నియోజకవర్గానికి నెరవేరనున్న మార్కెట్ యార్డ్ కల



**అనంతపురం జూలై 18 సీమ వార్త సాయంత్రం.** రాప్తాడు వ్యవసాయ మార్కెట్ యార్డుకు భూమి కేటాయింపు అనుమతులు రావడంపై మార్కెట్ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీతకు కమిటీ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాప్తాడుకు గత కొన్నేళ్లుగా మార్కెట్ యార్డు కమిటీ ఉన్నప్పటికీ నియోజకవర్గంలో ఎక్కడా యార్డు లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సునీత గతంలోనే స్పష్టమైన హామీ ఇచ్చారు. మార్కెట్ యార్డ్ నిర్మాణం చేపడుతామని.. ఇందుకు స్థలం కూడా కేటాయించేలా చూస్తామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం శ్రీ పండమేరు వెంకటరమణ స్వామి దేవస్థానానికి చెందిన భూమిని లీజు ప్రాతిపదికన కేటాయించాలని దేవాదాయశాఖకు పలు సార్లు విజ్ఞప్తి చేశారు. అన్ని అంశాలు పరిశీలించిన తర్వాత దేవాదాయశాఖ అమోదముద్ర వేసింది. సర్వే నెం. 476-3లోని భూమిలో 15 ఎకరాలను రాప్తాడు వ్యవసాయ మార్కెట్ కమిటీకి 11సంవత్సరాల లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాప్తాడు మార్కెట్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ఇతర సభ్యులు, మార్కెట్ కమిటీ అధికారులు ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలో మార్కెట్ యార్డు ఉండాలని ఎప్పటి నుంచి ప్రయత్నాలు చేస్తున్నామని.. ఇన్ని రోజులకు ఈ కల సాకారం అవుతోందని ఎమ్మెల్యే సునీత అన్నారు. నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వారికి అన్నివిధాలుగా ఉపయోగపడే విధంగా మార్కెట్ యార్డు ఉంటుందన్నారు. ఈ భూమి జాతీయ రహదారి-44కు ఆనుకుని ఉండటంతో రైతులు మరియు వ్యాపారుల సంక్షేమం కోసం గొర్రెలు, మేకల సంత నిర్వహణకు అనుకూలంగా ఉంటుందన్నారు. కమిటీ సభ్యులు ఈ విషయంలో ప్రత్యేకంగా చొరవ తీసుకుని రైతులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. మరోవైపు మార్కెట్ యార్డ్ ఛైర్మన్, అధికారులు మాట్లాడుతూ ఎమ్మెల్యే సునీత చొరవ వలనే ఇది సాధ్యమైందన్నారు. లీజు నిబంధనల ప్రకారం 15ఎకరాల భూమిని 11సంవత్సరాల పాటు ప్రతి ఎకరానికి సంవత్సరానికి 50వేలు అద్దె చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు అద్దెపై 30 శాతం పెంపు ఉంటుందని.. మిగిలిన భూమిని దేవస్థానం భవిష్యత్ అవసరాల కోసం కేటాయించారని వివరించారు...

## కోటలో “పంకా “నేతలు “కమలం” గూటికీ..!!

.... బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ చొరవతో బిజెపిలో చేరిన వైసిపి ముఖ్య నాయకులు.

.....పెనుగొండ నియోజకవర్గం నుంచి వైస్సార్సీపీ సీనియర్ నేత వెంకటరాముడు బీజేపీ లో చేరిక

**గోరంట్ల జూలై 18 సీమ వార్త సాయంత్రం.**



దశాబ్ద కాలంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో మండల పార్టీ అధ్యక్షుడిగా నిస్వార్ధ సేవలు అందించిన పెనుగొండ నియోజకవర్గం, మునిమడుగు గ్రామానికి చెందిన వెంకటరాముడు శనివారం విజయవాడలో భారతీయ జనతా పార్టీలో చేరారు.రాష్ట్ర బీజేపీ నాయకులు పీవీనఎన్ మాధవ్ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ , శ్రీ సత్య సాయి జిల్లా బీజేపీ అధ్యక్షులు జి ఎం శేఖర్ గారి సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకొని పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వెంకటరాముడు మాట్లాడుతూ, గత 15సంవత్సరాలుగా వైస్సార్సీపీ లో పని చేసినప్పటికీ తగిన గుర్తింపు లభించలేదని, బీసీ లకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం, మంత్రి సత్య కుమార్ యాదవ్ పనితీరు ఆకర్షించడంతో బీజేపీ లో చేరినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో పెనుగొండ నియోజకవర్గం వ్యాప్తంగా మరిన్ని చేరికలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.బోయ వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన నిరు గంటి బోయ వెంకటరాముడు గారి చేరిక సత్యసాయి జిల్లా బీజేపీ కి ఎంతో బలం చేకూరుస్తుందని నాయకులు పేర్కొన్నారు. పెనుగొండ నియోజకవర్గం వ్యాప్తంగా ఆయనకున్న మంచి పేరు, ప్రజా సంబంధాలు పార్టీకి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. వెంకటరాముడు వారితోపాటు నిరుగంటి అభిషేక్ రాంపురం పంచాయతీ ఆవుల శ్రీధర్ చేరికకు కృషి చేసిన గోరంట్ల బీజేపీ అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ మరియు ధర్మవరం నియోజకవర్గం రూరల్ మండల అధ్యక్షుడు గుడ్లూరు చంద్రశేఖర్ ఈ ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబ్లేస్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేదర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు



## మీ సపోర్టుతో 40 ఏళ్లు పాలిటిక్స్ చేశా..!!



....అభివృద్ధి అంటే చేసి చూపించాము, మీ అందరికీ పాధాభివందనము.

....బాణా సంచా పెల్చి పూల వర్షం ముతో ఎంపీ పార్థసారధికి ఘనంగా స్వాగతం.

.....గజమాల తో బీకే కి ఘన సన్మానం.

**రొద్దం జూలై 18(సీమవార్త సాయంత్రం.** మండలం లోని బెల్ కంపెనీ సీ యస్ ఆర్ నిధులు 6కోట్ల రూపాయలతో మండల కేంద్రములోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ము నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమం శనివారం నిర్వహించిన లిహిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె పార్థసారధి లి మరియు. బెల్ కంపెనీ డైరెక్టర్ రజనిష్ శర్మ, మరియు జనరల్ మేనేజర్ సంజయ్ అగర్వాల్ మరియు,కలెక్టర్ శ్యాం ప్రసాద్ మరియు మంత్రి సవిత మరియు కూటమి నాయకులు తదితరులు హాజరయ్యారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి. ఎంపీ బీకే మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం కోసం ఒక ఆసుపత్రి నిర్మించాలని ఎన్నికల సమయంలో,నా సతీమణి కి ప్రజలు తెలియజేయగా వారి కోరిక మేరకు ఈరోజు ఆసుపత్రి నిర్మాణం కోసం బెల్ కంపెనీ ప్రతినిధులను సంప్రదించి. సీ యస్ ఆర్ నిధులు 6 కోట్ల రూపాయలు మంజూరు చేయించడం జరిగింది. కేవలం ఒక సంవత్సరంలో హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం అని బెల్ కంపిని కంపెనీ ప్రతినిధులు తెలిపారు అని తెలిపారు.. గతంలో నేను జెడ్పి చైర్మన్ గా ఉన్న సమయంలో ఈ మండలంలో 9 హైస్కూల్ ను తీసుకువచ్చా, అంతేకాకుండా మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశాం అని తెలిపారు.ఒక జూనియర్ కళాశాల తీసుకవచ్చాం అంతేకాకుండా మొన్ననే.పీ యమ్ జీ యస్ వై -×ఎ ద్వారా చిన్నకోడిపల్లి రహదారికి 3 కోట్ల రూపాయలను తీసుకువచ్చాం. అంతే కాకుండా 2014 నుంచి 19 లోపల గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తిచేసి, కియా పరిశ్రమ మరియు.బెల్ పరిశ్రమలు తీసుకువచ్చి అనంతపురం జిల్లాను పారిశ్రామిక కారిడార్ గా మార్చిన ఘనత మన ముఖ్యమంత్రి గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడు, మరియు నారా లోకేష్ గారి వరమే అన్నారు. ఇవి కాకుండా మొన్ననే పుట్టపర్తి కేంద్రంగా రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ అభివృద్ధి సంస్థ (డీ ఆర్ డీ ఓ) యుద్ధ విమానాల తయారీ కేంద్రాని కి శంకుస్థాపన చేయడం జరిగింది అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో అధికారులు కూ టమి నాయకులు ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.



సీమ వార్త సాయంకాలం
శనివారం
18 జూలై 2026

## ఫిట్స్ (వాయి/మూర్చ) వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



**మడకశిర, జూలై 18: సీమ వార్త సాయంత్రం** జన విజ్ఞాన వేదిక మడకశిర శాఖ ఆధ్వర్యంలో 19-07-2026 (ఆదివారం) ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మడకశిరలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం ఆవరణలో ఫిట్స్ (వాయి/మూర్చ) వ్యాధిగ్రస్తుల కోసం వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి వి. జి. శ్రీనివాసులు, మడకశిర మండల శాఖ అధ్యక్షులు ఆర్. రమేష్, మండల ప్రధాన కార్యదర్శి డి. మారుతీ ప్రసాద్ తెలిపారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డా. హర్షవర్ధన్, న్యూరోలజీ, జనరల్ ఫిజీషియన్ ఉచితంగా వైద్య సేవలు అందించనున్నారని తెలిపారు ఫిట్స్ (వాయి/మూర్చ) వ్యాధితో బాధపడుతున్న వారు నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ, వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా చాలామంది తగిన చికిత్స పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. అటువంటి బాధితులకు నిపుణుల వైద్య సలహాలు అందించి, వ్యాధిపై అవగాహన కల్పించాలనే సామాజిక సేవా దృక్పథంతో జన విజ్ఞాన వేదిక ప్రతి రెండు నెలలకు 3 వ ఆదివారం ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తోందని నాయకులు వివరించారు.

వాయి, లేదా మూర్చ వ్యాధితో బాధపడుతున్న వారు ప్రస్తుతం వాడుతున్న మందుల చీటీలు, వైద్యుల ప్రిస్క్రిప్షన్లు, గత పరీక్షల నివేదికలు (రిపోర్టులు) ఉంటే వాటిని తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు.

మరిన్ని వివరాలకు 9491507327 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఈ అవకాశాన్ని మడకశిర నియోజకవర్గ ప్రజలు, ముఖ్యంగా వాయి/మూర్చ వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకొని ఆరోగ్య ప్రయోజనం పొందాలని జన విజ్ఞాన వేదిక నాయకులు విజ్ఞప్తి చేశారు.

## ఇంద్రకీలాద్రిపై వెలసి ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారికి, ప్రత్యేక పూజలు



**మడకశిర జూలై 18 సీమ వార్త సాయంత్రం** విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలసి ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి( వారాహి దేవి ) విజయవాడ సిటీ నాయి బ్రాహ్మణ సోదరీమణులు ఆషాడ మాసం సరే అమ్మవారికి శుక్రవారం ఘనంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ట్రస్ట్ బోర్డు మెంబర్ తరిగొప్పుల పార్వతి హుస్సేన్ పాల్గొన్నారు.. ఈ కార్యక్రమం విజయవాడ చిట్టినగర్ నాయి బ్రాహ్మణ సోదరి నిమ్మలపూడి దుర్గ ఆధ్వర్యంలో నాయి బ్రాహ్మణ సోదరీమణులు రాజేశ్వరి, కీర్తి, రాజ్యలక్ష్మి, నాగమణి సోదరీమణులు పాల్గొని అమ్మవారికి ఆషాడ సారి ఘనంగా సమర్పించినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారిని ఎంతో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని దానిలోని భాగంగానే ఈసారి కూడా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అమ్మవారు ప్రతి ఒక్కరిని చల్లగా చూడాలని వేడుకోవడం జరిగిందన్నారు.

## స్వచ్ఛత కోసమే... స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర.

కూరగాయల మార్కెట్ ప్రాంతంలో కార్యక్రమాలు.

హాజరైన... ఎంపీడీవో కమల భాయ్, టిడిపి కన్వీనర్ బాలకృష్ణ చౌదరి.



**గోరంట్ల జూలై 18 సీమ వార్త.** పట్టణాలు గానీ గ్రామాల్లో గాని ప్రతి వీధి పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతోనే స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కమల భాయ్, టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి తెలిపారు. గోరంట్ల మేజర్ పంచాయతీ ఈవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగో వార్డు కూరగాయల మార్కెట్ ప్రాంతంలో శనివారం అధికారులు మరియు పార్టీ నాయకుల ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచంద్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచంద్ర కార్యక్రమాల ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి,మాజీ వార్డ్ మెంబర్ పసుపులేటి శ్రీనివాసులు, సింగిరెడ్డిపల్లి శ్రీకాంత్, ప్రతాప్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సెల్ అధ్యక్షుని పరామర్శించిన సమన్వయకర్త ఈరల కప్ప



మడకశిర జూలై 18 సీమ వార్త సాయంత్రం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వైకాపా బీసీ సెల్ అధ్యక్షుడు జగన్నాథను శనివారం వైఎస్ఆర్సిపి పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప పరామర్శించారు. శనివారం తురక వాండ్లపల్లి గ్రామంలో జగన్నాథ్ గతవారం రోజుల క్రితం ద్విచక్ర వాహనం వెళ్తుండగా గాయపడిన విషయం తెలిసినదే. విషయం తెలుసుకున్న సమన్వయకర్త ఈరలక్కప్ప తురకవాండ్లపల్లిలో పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప , మాజీ వక్కలిగా స్టేట్ డైరెక్టర్ నాగరాజు, సత్యసాయి జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి నరసింహ, సత్య సాయి జిల్లా పంచాయతీరాజ్ కార్యదర్శి చిరంజీవి, తాలూకా బూత్ కన్వీనర్ మల్లికార్జున్ గౌడ్, మాజీ సర్పంచ్ హనుమంత్ గౌడ్ , ఎంపిటిసి రామలింగప్ప, హనుమంతు గౌడ్, పంచాయతీ అధ్యక్షుడు కిషోర్,జి ఆర్ నారాయణ, బులసముద్రం పంచాయతీ ఉపాధ్యక్షుడు ఓబులేష్, తురుకవాండ్లపల్లి కిష్టప్ప, మండల బూత్ కన్వీనర్ రవి, షేక్ బాషా, మా భాష వైకాపా నాయకులు కార్యకర్తలు తదితరులు హాజరవడం జరిగింది.

# పల్లెల్లో పాడి ఆవుల కోసం... రైతులకు వడ్డీ లేని రుణాలు.






గోరంట్ల మండలంలో 35 గ్రామాల్లో 35 పాడి ఆవులకు రుణాలు.

జిల్లాలో 53 గ్రూపులలోని 530 మంది మహిళ రైతులకు జీవనాదారం కల్పించిన స్వచ్ఛంద సంస్థ.

**గోరంట్ల జూలై 18 సీమ వార్త సాయంత్రం** గోరంట్ల మండలం మండలపల్లి, .ఖాజాపురం ,గ్రామాల లొ శ్రీ సాయి గ్రామీణ పాడి సంఘం ప్రెసిడెంట్ పద్మావతి , మహిళా పాడి రైతులకు ఫ్రాన్సిస్ కోతమ్మ లవ్ ఇన్ ఆక్షన్ వారి సహకారంతో పాడి ఆవుల కోసం వడ్డీ లేని రుణం ఒక్కొక్కరికి 50 వేల రూపాయల ప్రకారం మండలపల్లి కి పదిమంది మహిళా పాడి రైతులకు 5 లక్షల రూపాయలు , ఖాజాపూర్ మహిళా పాడి రైతులకు పదిమందికి 5 లక్షల రూపాయలు, మొత్తం 10 లక్షల రూపాయలు మంజూరు చేయడమైనది. మండలపల్లి ,ఖాజాపురం గ్రామాల యందు ఇచ్చిన మొత్తం 20 పాడి ఆవులకు ట్యాగులు వేసి ఇన్సూరెన్స్ చేయించడం జరిగింది.అతివృష్టి ,అనావృష్టి కారణంగా పనులు లేక పట్టణాలకు వలసలు వెళుతున్నారు. ఇండ్ల వద్ద వృద్ధులు, పిల్లల చదువులకు అంతరాయం ఏర్పడి ఇబ్బందులకు గురి అవుతున్నారు. కొంతవరకు రైతుల ఇబ్బందులు తొలగించాలని, వలసలు ఆపాలని, పాడి పరిశ్రమ వలన కొంతవరకు ఆర్థిక ఇబ్బందులు తొలగించవచ్చునని ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి మహిళా పాడి రైతులు, గ్రామ పెద్దలు. సంస్థ సిబ్బంది హాజరయ్యారు. సంస్థ ఇప్పటివరకు 53 గ్రూపులకు అనగా 530 మంది మహిళా పార్టీ రైతులకు, కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి, గోరంట్ల మండలాల యందు 35గ్రామాలకు పాడి ఆవులు ఇవ్వడం జరిగింది. మండలంలోని ఖాజాపురం గ్రామానికి చెందిన మంజుల మాట్లాడుతూ శ్రీ సాయి గ్రామీణ పాడి సంఘం చేస్తున్న హోలీకౌ కార్యక్రమం గురించి పక్క గ్రామాల నుండి తెలుసుకున్నామన్నారు.. అడిగిన వెంటనే మా బాధలను అర్థం చేసుకొని మా గ్రామానికి కౌ ప్రోగ్రాం ఇచ్చినందుకు సంతోషిస్తూ అభినందనలు తెలుపుకుంటున్నాను.సావిత్రి, మండల పల్లె: నా పేరు సావిత్రి, మాది మండల పల్లె గ్రామం. వర్షాలు లేక పంటలు పండక ఇబ్బందిగా ఉన్న పరిస్థితుల్లో సాయి గ్రామీణ పాడి సంఘం గురించి తెలియజేశారు ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# నల్ల మాడలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమము

### ....మొక్కలు నాటిన సెక్రెటరీ దాదాసాబ్, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు.




**నల్లమడ జులై 18 సీమ వార్త సాయంత్రం.** నల్లమాడ మండల కేంద్రంలోప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్ డబ్ల్యు పిసి షెడ్ (చెత్తతో సంపద తయారీ కేంద్రం) ఆవరణం నందు మొక్కలు నాటడం జరిగింది.అనంతరం హాజరైన నాయకులు హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు అవ్వాలని ప్రకృతి పర్యావరణాన్ని కాపాడడం కోసం ప్రతి ఒక్కరు కూడా విధిగా మొక్కలు నాటాలని వాటిని సంరక్షించాలని అంతే కాకుండా వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటి పరిసరాలు, వీధులు శుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ కార్మికులు వస్తే తడి చెత్త పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని,అడవులను నరకడమాని , వాటినిరక్షించుకోవాలని, అలాగే పారిశుద్ధ కార్మికులు వీధులను, చెత్తను తొలగించడం, వీధులను శుభ్రం చేయుటనే కాదు మొక్కలు నాటి సంరక్షితమని బాధ్యత మాది అన్నందుకు చాలా సంతోషంగా ఉందని వారి తెలిపారు.ఈ కార్యక్రమానికి స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ గంగాధర్, పిడిఓ దాదా సాబ్ ,శానిటేషన్ వర్కర్లు అలంక నరసింహులు, స్థానిక టిడిపి నాయకులు అగ్గి రాముడు, మరియు, గంగాద్రి, గంగాదేవి, గాయత్రి, నారాయణమ్మ, చెన్నమ్మ, నాగలక్ష్మి, వాటర్ మాన్ గంగాద్రి, ప్రజలు పాల్గొన్నారు.

# ఖరీఫ్--2026 పంటల వాతావరణ బీమా నమోదు గడువు జూలై 24 వరకు పొడిగింపు



**మడకశిర జూలై 18 సీమ వార్త సాయంత్రం.** ఖరీఫ్--2026 సీజన్‌కు సంబంధించి వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం పి ఎం బి సి ఐ ఎస్ కింద పంటల బీమా నమోదు గడువును జూలై 15 నుండి జూలై 24, 2026 వరకు పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని తమ పంటలకు బీమా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కళ్లుమర్రి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్బిఐ శాఖలో బ్యాంక్ మేనేజర్ సాయి ప్రసాద్తో కలిసి రైతులకు పంటల బీమా పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు, అనావృష్టి, అధిక వర్షాలు, తుఫానులు వంటి ప్రతికూల పరిస్థితుల వల్ల కలిగే పంట నష్టాలకు ఆర్థిక రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద వేరుశెనగ, పత్తి, దానిమ్మ, టమాటా, చీనీ (మోసంబి) పంటలకు బీమా వర్తిస్తుందని తెలిపారు. వేరుశెనగ -- ఎకరానికి రూ. 640, పత్తి -- ఎకరానికి రూ. 1,900, టమాటా -- ఎకరానికి రూ. 1,600, దానిమ్మ -- ఎకరానికి రూ. 3,750, చీనీ (మోసంబి) -- ఎకరానికి రూ. 2,750. అదేవిధంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పి ఎం ఎఫ్ బి వైకింద కంది, మొక్కజొన్న, రాగి, ఆముదం, వరి పంటలకు జూలై 31, 2026 వరకు బీమా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కంది -- ఎకరానికి రూ. 102, మొక్కజొన్న -- ఎకరానికి రూ. 165, రాగి -- ఎకరానికి రూ. 100, ఆముదం -- ఎకరానికి రూ. 100, వరి -- ఎకరానికి రూ. 200. వేరుశెనగ పంటకు రుణం తీసుకున్న రైతులు సంబంధిత బ్యాంకులోనే బీమా ప్రీమియం చెల్లించి నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. కంది, మొక్కజొన్న, రాగి, ఆముదం, వరి, దానిమ్మ, పత్తి, టమాటా, చీనీ సాగు చేస్తున్న రైతులు మీ సేవా కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు (సి ఎస్ లు) ద్వారా కూడా బీమా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. బీమా నమోదు కోసం ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పట్టాదారు పాస్‌పుస్తకం, రైతు స్వీయ ధృవీకరణ పత్రం తదితర పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. బీమా క్లెయిమ్‌లు పంట నమోదు వివరాల ఆధారంగా పరిశీలించి మంజూరు చేయబడతాయని, అందువల్ల రైతులు నమోదు చేసిన పంట వివరాలు మరియు వాస్తవంగా సాగు చేసిన పంట ఒకే విధంగా ఉండేలా జాగ్రత్త వహించాలని సూచించారు. రైతులు చివరి తేదీల వరకు వేచి ఉండకుండా వెంటనే పంటల బీమా నమోదు చేసుకుని ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాల నుంచి ఆర్థిక భద్రత పొందాలని మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప తెలియ చేశారు.

## 12 ఏళ్లుగా రూ.12 వేల జీతమే ఎంపీఈఓ నాయకుల ఆగ్రహం

జీతాలు పెంచండి లేకుంటే సమ్మె

ఆంధ్రప్రదేశ్ మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ అసోసియేషన్ హెచ్చరిక

సత్యసాయి జిల్లా వ్యవసాయ అధికారికి ఎంపీఈవో ల వినతి

జులై 20 నుంచి సహాయ నిరాకరణకు సిద్ధం



**పుట్టపర్తి, జులై 18 (సీమవార్త సాయంకాలం బ్యూరో) :-** వ్యవసాయ శాఖలో మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లుగా గత 12 సంవత్సరాలుగా సేవలందిస్తున్నా కూడా రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచకపోవడం దారుణమని ఆంధ్రప్రదేశ్ మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ అసోసియేషన్ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా వ్యవసాయ అధికారికి తమ న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎంపీఈవో లకు ఇప్పటికీ రూ.12,000 జీతం, రూ.3,000 ఇన్‌సెంటివ్ మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ధరలు పెరుగుతున్నా వేతనాలు పెరగకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా ఉందన్నారు. గత నాలుగు నెలలుగా జీతాలు కూడా రాలేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ, సమాన పనికి సమాన వేతనం కింద నెలకు రూ.35,000/- జీతం వెంటనే అమలు చేయాలని, ఎంపీఈవో లకు శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నాన్-శాంక్షన్ పోస్టులను శాంక్షన్ పోస్టులుగా మార్చడంతో పాటు, ఈహెచ్ఎస్ హెల్త్ కార్డు, ప్రమాద బీమా, విధి నిర్వహణలో మరణిస్తే ఎక్స్‌గ్రేషియా, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్ వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే జులై 20 నుంచి 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా సహాయ నిరాకరణకు దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షులు చెన్నా నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు మీనా, గంగరాజు, ఈసీ సభ్యులు రాంమోహన్, జయరాం, మారుతి, లక్ష్మిభాయి, భాగ్య, ముబీన, రాజేశ్వరి, అరుణ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## జులై 22న "తల్లికి వందనం" నిధులు విడుదల

ఇంటర్ 1వ సంవత్సరం విద్యార్థులు వెంటనే బ్యాంకు ఖాతాలు తెరవాలి

ఐపిపిబి లో రూ.200తో ఖాతా ప్రారంభించే అవకాశం

...వివరాలు తెలిపిన డీఎస్.డబ్ల్యూఓ ఎం.శ్రీరాములు



**పుట్టపర్తి, జులై 18 (సీమవార్త సాయంకాలం బ్యూరో) :-** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "తల్లికి వందనం" పథకం కింద 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని జులై 22న విడుదల చేయనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల సంక్షేమం మరియు సాధికారత అధికారి ఎం.శ్రీరాములు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లాలో ఇంటర్ 1వ సంవత్సరం చదువుతున్న అర్హులైన విద్యార్థుల్లో ఇంకా బ్యాంకు ఖాతా లేదా ఎన్పిసిఐ సీడింగ్ పెండింగ్‌లో ఉన్న వారు వెంటనే ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. "జులై 22న నిధులు విడుదల కానున్నాయి. అప్పటికి అన్ని ఖాతాలు సిద్ధంగా ఉండాలి" అని ఆయన స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతా లేని విద్యార్థుల కోసం ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఐపిపిబి ద్వారా కేవలం రూ.200/-తోనే ఖాతా ప్రారంభించుకునే సదుపాయం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. ఖాతా ప్రారంభానికి విద్యార్థులు ఆధార్ కార్డు, 10వ తరగతి మార్కుల మెమో లేదా జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కు అనుసంధానమైన మొబైల్ నంబర్, రూ.200/- ఖాతా ప్రారంభ రుసుము తీసుకురావాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండని మైనర్ విద్యార్థులు తల్లిదండ్రులు లేదా సంరక్షకుల ఆధార్ మరియు బయోమెట్రిక్ ద్వారా ఈ కేవైసీ పూర్తి చేయాలని వివరించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు అర్హులైన విద్యార్థుల వివరాలను వెంటనే సేకరించి, సమీప బ్యాంకు లేదా పోస్టాఫీసులో ఖాతాలు తెరిపించాలని ఎం.శ్రీరాములు కోరారు.


## ఎస్ ఐ ఆర్ పై గ్రామసభ ఏర్పాటు

**మడకశిర జూలై 18 సీమ వార్త సాయంత్రం** ఎమ్మెల్యే టిటిడి పాలక మండలి సభ్యులు సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు ఎమ్మెస్ రాజు , రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గౌరవనీయులు గుండుమల తిప్పే స్వామి , ఆదేశాల మేరకు మడకశిర పట్టణ పరిధిలోని 200 బూత్ నందు మాజీ మున్సిపల్ చైర్మన్ నరసింహారాజా ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు ఈ కార్యక్రమంలో పుల్లయ్య చౌదరి బూత్ ఇన్చార్జ్ రామాంజనేయుల డీలర్ మల్లికార్జున, కిరణ్ , ఆర్ పి నాగరత్న , బి ఎల్ ఓ వీణ బాయ్ , పట్టణ కన్వీనర్ ఓంకార్ ప్రజలు పాల్గొన్నారు.

సీమ వార్త సాయంకాలం

శనివారం
18 జూలై 2026

# తాడిపత్రి చరిత్రలో రికార్డు - నీట్‌లో 7152వ ర్యాంకు సాధించిన అంజద్ మారూఫ్





**లాంగ్ టర్మ్ కోచింగ్ లేకుండా, మొదటి ప్రయత్నంలోనే మెరుగైన అఖిల భారత ర్యాంకు**

**తాడిపత్రి విద్యారంగానికి గర్వకారణం**

**తాడిపత్రి, జులై 17 సీమ వార్త సాయంత్రం :** దేశవ్యాప్తంగా 22 లక్షల మంది పోటీపడిన నీట్-2026 ప్రవేశ పరీక్ష ఫలితాలలో తాడిపత్రి పట్టణం విజయనగర్ కాలనీకి చెందిన గొడుగు అంజద్ మారూఫ్ అఖిల భారత స్థాయిలో 7152వ ర్యాంకు సాధించి తాడిపత్రి చరిత్రలో సరికొత్త రికార్డు నెలకొల్పారు. గురువారం రాత్రి విడుదలైన ఫలితాలతో తాడిపత్రిలో సంబరాలు వెల్లువెత్తాయి. పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ పద్మవాణి హైస్కూల్ కరస్పాండెంట్ నాగ పీరయ్య, అలీమాలు దంపతుల కుమారుడైన అంజద్ మారూఫ్ ఈ ఘనత సాధించారు.

### సాధారణ కుటుంబం నుంచి అసాధారణ విజయం

అంజద్ మారూఫ్ పదో తరగతి వరకు తన తండ్రి నిర్వహిస్తున్న పద్మవాణి స్కూల్లోనే విద్యనభ్యసించారు. ఇంటర్మీడియట్ కోసం విజయవాడలోని భవిష్య కళాశాలలో బైపిసి గ్రూపులో చేరారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో, తన సొంత కృషితో ఈ స్థాయికి ఎదిగారు.

### లాంగ్ టర్మ్ కోచింగ్ లేకుండానే...

ప్రస్తుతం చాలా మంది విద్యార్థులు లక్షల రూపాయలు ఖర్చు చేసి లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్న తరుణంలో, అంజద్ మారూఫ్ కళాశాలలో లభించిన కోచింగ్ తోనే, ఇంటి దగ్గర స్వీయ అధ్యయనంతో మొదటి ప్రయత్నంలోనే ఈ అద్భుత ర్యాంకు సాధించడం విశేషం. ఇది ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకం.

### ఎదురుదెబ్బను ధైర్యంగా ఎదుర్కొన్నాడు

నీట్ ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ కారణంగా ప్రభుత్వం మొదటి పరీక్షను రద్దు చేయడంతో అంజద్ తీవ్రంగా కలత చెందారు. కానీ వెంటనే తేరుకొని రెండోసారి జరిగిన పరీక్షకు మరింత పట్టుదలతో చదివి ఈ ర్యాంకు సాధించారు. అతని పట్టుదలకు ఇదే నిదర్శనం.

### భవిష్యత్ లక్ష్యం

ఈ ర్యాంకుతో ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు ఖాయమైన అంజద్, భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి పేద ప్రజలకు ఉచితంగా సేవ చేయాలనేది తన కల అని తెలిపారు.
కుమారుడి విజయంపై తల్లిదండ్రులు నాగ పీరయ్య, అలీమాలు హర్షం వ్యక్తం చేశారు. పద్మవాణి స్కూల్, భవిష్య కళాశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు, రాజకీయ నేతలు అంజద్ ను అభినందించారు.

## గోపేపల్లి సచివాలయం వద్ద మొక్కల పెంపకం.

**పాల్గొన్న....నల్లమడ ఎంపీడీవో దేశం గారి అందినప్ప**



**నల్లమడ జూలై 18 సీమ వార్త** నల్లమాడ మండలంలోని గోపేపల్లి గ్రామ పంచాయతీ సచివాలయంలో నిర్వహించిన ససాకార్యక్రమంలో ఎంపీడీవో శ్రీ డి. అంజినప్ప పాల్గొని మొక్కల నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కురుమల గ్రామ పంచాయతీలో రమణారెడ్డి భూమిలో మొక్కల నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లమాడ మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీల సిబ్బందికి, ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 100 మొక్కలు నాటే లక్ష్యంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో దేశం గారి సూచించారు. నల్లమాడ మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో డి ఎల్ హెచ్ ప్లాంటేషన్ కార్యక్రమం కింద సుమారు 2000 మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీ డి. అంజినప్ప, ఏపీఓ శ్రీ కె. రఘు నాథ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చెరువులోని కంప చెట్లు తొలగింపు



మడకశిర జూలై18 సీమ వార్త సాయంత్రం నియోజకవర్గ పరిధిలోని ఆగలి మండలం ఇనగలూరు గ్రామపంచాయతీలో ఇనగలూరు చెరువు చుట్టుపక్కల కంప చెట్లను తొలగించడానికి శనివారం భూమి పూజ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆగలి జడ్పిటిసి సభ్యులు వి.ఉమేష్ , ఆగలిమండల అధ్యక్షులు టీ తిప్పే స్వామి , మండల క్లెస్టర్ కో కన్వీనర్ శివన్న ఇనగలూరు ఆయకట్టా అధ్యక్షులు కే నరసింహప్ప అలాగే ఉపాధ్యక్షులు రామచంద్రప్ప ఇనగలూరు తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నేడు ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ రాక



**అమరాపురం జూలై 18సీమవార్త సాయంకాలం** మండల పరిధిలోని అగ్రహారం, గుణేహళ్లి, ఆలదపల్లి,కడతదహళ్లి గ్రామాలలో నూతనంగా నిర్మిస్తున్న బిఎస్ఎన్ఎల్ టవర్ ల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు విచ్చేస్తున్నట్లు మాజీ ఎంపీపీ మీనాక్షి రామిరెడ్డి తెలిపారు. 12 గంటలకు అగ్రహారం,1.30 గుణేహళ్లి,3 గంటలకు ఆలదపల్లి, 4గంటలకు కడతదహళ్లి గ్రామాలలో జరిగే కార్యక్రమంలో మండలంలోని తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రతి ఒక్కరూ అత్యధిక సంఖ్యలో హాజరై భూమి పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## సేవా కార్యక్రమాలకు సిద్ధమైన మహిళ లయన్స్ క్లబ్ ల కొత్త కార్యవర్గం

**ప్రొఫెసర్ ఈశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం**



**తాడిపత్రి, జులై 17 సీమ వార్త సాయంత్రం :** లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ తాడిపత్రి, మహిళ 2026-27 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాల ప్రతిష్టాపన కార్యక్రమం శుక్రవారం రాత్రి రవితేజ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించరు. యోగి వేమన యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ యస్.ఈశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గం ఈ విధంగా ఉంది లయన్స్ క్లబ్ తాడిపత్రి అధ్యక్షుడు జి.అనినారాయణ రెడ్డి కార్యదర్శి గా వై.లక్ష్మీనారాయణ రెడ్డి కోశాధికారి, వై.సౌహైల్ లయన్స్ క్లబ్ తాడిపత్రి మహిళ అధ్యక్షులు లయన్ పి.సవిత కార్యదర్శి పి.లక్ష్మీదేవి కోశాధికారి జె.హైమావతి లను ఏకగ్రీవంగా ఏనుకొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మరింత మేలు చేయాలని సూచించారు. నూతన కార్యవర్గం పేదలకు, అవసరమైన వారికి సహాయం అందించేందుకు ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఎంజేఫ్ లయన్ టి.సంజీవరెడ్డి వ్యవహరించారు. నూతన కార్యవర్గ ప్రతిష్టాపన అధికారిగా పీఎంజేఫ్ లయన్ కె.చిన్నప్ప రెడ్డి, కీనోట్ అడ్రస్ ను ఎంజేఫ్ లయన్ జె.రామచంద్రప్రకాష్, అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విబిజి రాంజీ పథకం ద్వారా దానిమ్మ సాగు ప్రారంభం






అమరాపురం జూలై 18 సీమవార్త సాయంత్రం మండల పరిధిలోని మద్దనకుంట గ్రామపంచాయతీ పరిధిలోని మద్దనకుంట రైతు కేంచమ్మ, ఈశ్వరప్పల పొలంలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వి బి జి రామ్ జి పథకం క్రింద పండ్ల తోటల పెంపకం లో భాగంగా దానిమ్మ పంట సాగు కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి అఫ్ఫీజుల్లా, ఎంపీడీవో రామారావు, ఏపీఓ శివన్నలు ప్రారంభించారు. రెండు ఎకరాల పొలంలో దానిమ్మ సాగుకు విబి జి రాం జీ పథకం ద్వారా నిధులు మంజూరు చేయడంతో అధికారులు మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు మద్దనకుంట రఘు, మాజీ సర్పంచ్ శకునప్ప, టిడిపి యువ నాయకుడు పుల్లికుంట రాజు, గ్రామ కార్యదర్శి అరవింద్, ఫీల్డ్ అసిస్టెంట్ రంగారెడ్డి, మాబుఖాన్ తదితరులు పాల్గొన్నారు

## తెల్లకుల కేశవ గారి భార్య మృతి పట్ల సంతాపం తెలిపిన బొంబాయి రమేష్ నాయుడు





**యాడికి జులై 18 సీమ వార్త సాయంత్రం** యాడికి మండల కేంద్రంలోని అంత్రాల వీధి లో నివాసం ఉంటున్న తెల్లకుల కేశవ గారి భార్య నిన్నటి రోజున ఆకస్మిక మరణం పొందడం జరిగింది విషయం తెలిసుకొన్న స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబెర్ బొంబాయి రమేష్ నాయుడు ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్ ఈరోజు ఉదయం కేశవ గారి నివాసం చేరుకొని కేశవ గారి భార్య మృతి పట్ల సంతాపం తెలపడం జరిగింది

## అయాన్ తైక్వాండో అకాడమీలో సీఐ శివగంగాధర్ రెడ్డికి ఘన సన్మానం

**బదిలీపై వెళుతున్న సందర్భంగా క్రీడాకారులు, ప్రముఖుల ఆత్మీయ వీడ్కోలు**



**తాడిపత్రి, జులై 19 సీమ వార్త సాయంత్రం :** తాడిపత్రి రూరల్ సీఐగా విశిష్ట సేవలందించిన శివ గంగాధర్ రెడ్డి బదిలీపై వెళుతున్న సందర్భంగా శనివారం ఉదయం అయాన్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు యు. శివయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యప్రసాద్, వార్డెన్ కృష్ణయ్య, నీలకంఠ రెడ్డి, శ్రీ రంగనాథ్ తో పాటు తల్లిదండ్రులు, క్రీడాకారులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. శాలువాలు, పూలమాలలతో సీఐ శివ గంగాధర్ రెడ్డిని సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, అయాన్ తైక్వాండో అకాడమీ నిర్వహించిన ప్రతి టోర్నమెంట్, ప్రతి స్టంట్ కార్యక్రమానికి "కుదరదు" అనే మాట చెప్పకుండా హాజరై, క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందించి అకాడమీకి ఎల్లప్పుడూ అండగా నిలిచిన గొప్ప వ్యక్తిత్వం శివ గంగాధర్ రెడ్డిదని కొనియాడారు. ఈ సందర్భంగా సీఐ శివ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ, అయాన్ తైక్వాండో అకాడమీ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని స్పోర్ట్స్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి ఎం. సాయిబాబా విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కోచ్ లు వెంకటరమణ, నరేష్ పాల్గొన్నారు.

## మద్దనకుంట,వలసలో పిఎండిఎస్ విత్తన గుళికలతో వ్యవసాయ సాగు





**అమరాపురం జులై 18 సీమవార్త సాయంకాలం** మండల పరిధిలో ఏపీ సీ.ఎన్. ఎఫ్ పరిధిలోని వలస మరియు ఎన్ ఎం ఎన్ ఎఫ్ పరిధిలోని గ్రామమైన మద్దనకుంటలో శనివారం రైతు ఈశ్వరప్ప పొలంలో వక్క తోటలో పీఎండిఎస్ విత్తనాల గుళిక సాగు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల ప్రత్యేక అధికారి ఆఫ్ఫీజుల్లా, ఎంపీడీవో రామారావు, వ్యవసాయ అధికారి మంజునాథ్, ఏపీవో శివన్న, మడకశిర డివిజన్ ఇన్చార్జ్ ఎంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మంజునాథ్, మడకశిర డివిజన్ ఇంచార్జ్ ఎంటి రమేష్ లు మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు ఎల్ నినో ప్రభావానికి తట్టుకోవడానికి పిఎండిఎస్ పద్ధతిలో విత్తన గుళికలు తయారుచేసి సాగు చేయడం చాలా ఉపయోగకరమని రైతులకు అవగాహన కల్పించడం కల్పించడం జరిగింది. దీనివల్ల ప్రధాన పంటలు దెబ్బతినకుండా పెట్ట కు తట్టుకొని శక్తి పెరిగి పంటలు అధిక దిగుబడిని సాధించడానికి అవకాశం ఉంటుందని రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. విత్తన గుళికల తయారీ విధానాన్ని చూసిన రైతులు చాలామంది పొలాల్లో ఈ పద్ధతిని పాటించడానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వలసలోటిడిపి మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, నిరంజన్, నాగరాజు, మద్దనకుంటలో పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు మద్దనకుంట రఘు, మాజీ సర్పంచ్ శకునప్ప, పులికుంటరాజు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఎఫ్ ఎం టి యు.ప్రసన్న, ఎఫ్ఎం టి దేవిరమ్మ, ఎల్ టు శివకుమార్, ఎల్ వన్ నారాయణప్ప, ఎం ఎం ఎల్ ఎఫ్ లు, ఐ సి ఆర్ పి లు, పి ఐ సి ఆర్ పి లు మరియు రైతులు పాల్గొన్నారు.

## పురం బలిజ సంఘం కళ్యాణ మండపానికి... రూ, 5 లక్షల విరాళం.

**.... దాత నాగేంద్రకు అభినందనలు తెలిపిన సంఘం నాయకులు.**



**హిందూపురం జులై 18 సీమ వార్త సాయంత్రం.** హిందూపురం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న బలిజ కల్యాణ మండపం నిర్మాణానికి నాగలక్ష్మమ్మ మేడి శెట్టి కృష్ణమూర్తి ల కుమారుడు వీ నాగేంద్ర ముద్దిరెడ్డి పల్లి కి చెందినవ రూ ఐదు లక్షల ను విరాళంగా ఇచ్చినట్లు సంఘం నాయకులు జగదీష్ తెలిపారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881